సాక్షి ప్రకాశం

ఆదివారం । 21 । జూలై । 2024



మతోన్మాద చిచ్చుపెడుతున్న ఎన్డీఏ

రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం కుల మతాల మధ్య చిచ్చుపెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. - 8లో..



సేవలందించడంలో ముందుండాలి

ప్రజలకు సేవలందించడంలో రెడ్‌క్రాస్ ముందుండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. రెడ్‌క్రాస్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 29/25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జవహర్ నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఒంగోలు ప్రిన్సిపాల్ సి.శివరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల నుంచి ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు (2024–25లో) మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేసి తాము 5వ తరగతి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయునిచే ధ్రువపరిచి ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌లోడ్ చేయాలన్నారు. 2022–23లో మూడో తరగతి, 2023–24లో నాలుగో తరగతి ఉత్తీర్ణత పొంది 2024–25లో 5వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. దరఖాస్తులను సెప్టెంబర్ 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ప్రవేశ పరీక్ష 2025 జనవరి 18వ తేదీ ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవో.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఏపీటీఎఫ్ కృషి


ఒంగోలు: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ కృషిచేస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్రావు, బి.అశోక్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో ఒక ఉపాధ్యాయుని చొప్పున లేనందున పిల్లలను బడిలో చేర్పించని తల్లిదండ్రులు, హైస్కూలులో ఎలా చేర్పిస్తారన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో నంబర్ 117ను వెంటనే రద్దుచేయాలని, ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలను తక్షణమే నిర్వహించాలని కోరారు. 11వ పీఆర్సీ, డీఏ, ఇతర అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్సీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల మంజూరు, అన్ని ఉన్నత పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకం తదితర 20 సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఏపీటీఎఫ్ కృషి చేస్తుందన్నారు.

జమ్ములపాలెంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ సెలక్షన్స్



జమ్ములపాలెంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ సెలక్షన్స్ శనివారం నిర్వహించినట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జి.మురళి, జమ్ములపాలెం పాఠశాల పీడీ తుల్లిబిల్లి అశోక్ తెలిపారు. జిల్లా స్థాయి షూటింగ్ బాల్ సెలక్షన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి వందలాది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 10, 11 తేదీల్లో కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.



జిల్లా జట్టుకు ఎంపికైన జట్టు

డెంగీ వణుకు

మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి స్వగ్రామంలో వారం రోజుల కిందట ఓ యువకుడికి జ్వరం వచ్చింది. మామూలు జ్వరమే కదా అనుకున్న ఆ యువకుడి తల్లిదండ్రులు గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. కానీ జ్వరం తగ్గలేదు. మరుసటి రోజు 104 జ్వరం రావడంతో జూలై 9వ తేదీన ఒంగోలులోని జీజీహెచ్ వైద్యశాలకు తరలించారు. మూడు రోజుల తరువాత జూలై 13వ తేదీ సాయంత్రం మూత్ర విసర్జన కోసం బాత్‌రూంకు వెళ్లిన సదరు యువకుడు అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. జీజీహెచ్ వైద్యులు సకాలంలో చికిత్స చేయకుండా నిర్లక్ష్యం వహించడం వల్లనే తమ బిడ్డ చనిపోయాడని తల్లిదండ్రులు విలపిస్తున్నారు. రక్త పరీక్షలకే మూడు రోజులు తిప్పుకున్నారని, రిపోర్టులు వచ్చాక చేతులెత్తేశారని ఆరోపిస్తున్నారు. స్వయంగా మంత్రి స్వగ్రామానికి చెందిన తమ బిడ్డ మరణించినా తమను పట్టించుకున్న నాథుడే లేడని కన్నీరు మున్నీరు అవుతున్నారు.



జిల్లాలో డెంగీ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో డెంగీతో పాటు వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కొరవడడంతో బహిరంగ ప్రదేశాల్లో, కాలువల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో జిల్లాలో ఈ మహమ్మారి బారిన పడుతున్నారు. ఒకేసారి ప్లేట్లెట్స్ పడిపోతున్నాయి..ఉన్నట్టుండి నీరసించిపోతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఒక డెంగీ మరణం చోటుచేసుకుంది. ప్రభుత్వాస్పత్రుల్లో నమోదైన వివరాల ప్రకారం వారం రోజుల్లో 30 మంది పాజిటివ్ కేసులు నమోదైనట్టు తెలుస్తోంది. ఇక కిటకిటలాడుతున్న ప్రైవేటు ఆస్పత్రులను పరిశీలిస్తే ఈ లెక్క భారీగానే ఉంటుందని తెలుస్తోంది.

- మంత్రి బాల వీరాంజనేయ స్వామి ఇలాకాలో ఒకరి మృతి
- రెండు వారాల్లోనే 30 కేసులు పాజిటివ్
- జిల్లాలో చాపకింద నీరులా ప్రబలుతున్న డెంగీ
- వైరల్ వ్యాధుల నియంత్రణలో ప్రభుత్వం వైఫల్యం
- ప్రభుత్వ శాఖల మధ్య లోపించిన సమన్వయం
- పారిశుధ్య నిర్వహణ లోపం

ఒంగోలు టౌన్: జిల్లాలో డెంగీ జ్వరాలు తీవ్రతరమవుతున్నాయి. జిల్లా అంతటా ఎటు చూసినా జ్వరాలతో జనం ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల చుట్టూ తిరుగుతున్నారు. జ్వరంతో పాటుగా ఒళ్లు నొప్పులు, తల నొప్పి, కాళ్లు చేతులు, కండరాల నొప్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి 45 రోజులు దాటినా ఇప్పటికీ ప్రజారోగ్యంపై తగిన శ్రద్ధ చూపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అధికారులను పక్కన పెట్టి తమ మాట వినే అధికారే కావాలంటూ బదిలీలు చేపట్టడంతో ఆయా శాఖల అధికారులు పాలకుల చుట్టూ తిరుగుతూ ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారని ప్రజలు మండిపడుతున్నారు.

వారం రోజుల్లో 30 కేసులు...

జిల్లాలో డెంగీ కేసులు శరవేగంగా విస్తరిస్తున్నాయి. కేవలం వారం రోజుల్లో 30 డెంగీ కేసులు పాజిటివ్ వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏప్రిల్ నుంచి గత వారం వరకు జిల్లాలో 90 మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు తాజాగా 120 కు పెరిగాయి. అంటే రోజుకు కనీసం 3 నుంచి 4 డెంగీ కేసులు నమోదవుతున్నాయి. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. యుద్ధ ప్రతిపాతిపదికన తగిన చర్యలు తీసుకోకపోతే డెంగీ జ్వరాలు ప్రమాదకర స్థాయికి పెరిగే అవకాశాలున్నాయన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ 120 కేసులు కూడా కేవలం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకున్న వారి సంఖ్య మాత్రమే. ఇక ప్రైవేటు హాస్పిటళ్లలో చికిత్స చేయించుకుంటున్న వారు ఎంత మంది ఉన్నారో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

కిటకిటలాడుతున్న ప్రైవేటు వైద్యశాలలు:

జిల్లాలో ఏ ఇంట చూసినా కనీసం ఒక్కరైనా జ్వరంతో బాధపడుతున్న వారు కనిపిస్తున్నారు. దాంతో ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలలు కిటకిటలాడుతున్నాయి. చిన్నారులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా అనేక మంది జ్వరాల బారినపడి బాధపడుతున్నారు. ఉన్నట్టుండి 104 జ్వరం రావడంతో జనం బెంబేలెత్తుతున్నారు. వాతావరణం చల్లగా ఉండడంతో జ్వరంతో పాటు విపరీతంగా చలి, వణుకు వస్తోంది. ఆకలి లేకపోవడం, వాంతులు, వికారం కనిపించడంతో ఆందోళన చెందుతున్నారు. డెంగీ జ్వరం వచ్చిన వారిలో ప్లేట్‌లెట్లు భారీగా తగ్గిపోతాయి. అయితే కొందరిలో 30 వేల నుంచి 20 వేలకు పడిపోవడంతో ఆందోళనకు గురౌతున్న రోగులు కార్పొరేట్ వైద్యశాలలకు పరుగులు పెడుతున్నారు. అక్కడ ఐసీయూలో ఉంచి చికిత్స పేరిట వేలకు వేలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. అయితే జీజీహెచ్‌లో ఉచితంగానే ప్లేట్‌లెట్లు ఎక్కిస్తారు.

ఇంటి పరిసరాలు జాగ్రత్త..

డెంగీ వ్యాధి సోకడానికి ప్రధాన కారణం దోమలే. ఏడిస్ ఈజిప్ట్ అనే దోమ ద్వారా డెంగీ వ్యాధి సోకుతుంది. ఇది పగలు మాత్రమే కుడుతుంది. నిలువ ఉన్న నీటిలో ఈ దోమలకు చెందిన లార్వాలు స్ప్రింగుల్లా కదులుతుంటాయి. అదే మలేరియా దోమల లార్వాలైతే నిటారుగా ముందుకు కదలడం మనం గమనించవచ్చు. అందుకే ఇంట్లో కానీ, ఇంటి పరిసరాల్లో కానీ నీరు నిలవ ఉండకుండా చూసుకోవాలి.

నిలువ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు పారవేయాలి. ఇంటి పరిసరాల్లో పూల కుండీలు, పాతటైర్లు, టెంకాయలు, రోళ్లు, ఇతర వస్తువుల్లో ఎక్కడైనా నీరు ఉందేమో గమనించాలి. ఇంట్లో కూలర్లు, ఏసీలో కూడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి.

జిల్లా వ్యాప్తంగా లోపించిన పారిశుద్ధ్యం

జిల్లాలో ఎటు చూసినా పారిశుద్ధ్య లోపం కనిపిస్తోంది. వైద్యారోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, మున్సిపల్, ఒంగోలు కార్పొరేషన్ అధికారుల్లో సమన్వయ లోపం కారణంగా పారిశుద్ధ్య పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు అధికారులు వ్యవహరిస్తుండడంతో కింది స్థాయి ఉద్యోగులు సైతం నామమాత్రంగా పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు బదిలీల కోసం తిరుగుతున్నారు. దీంతో పట్టించుకునేవారు లేక రోజుల తరబడి కాలువల్లో మురుగు పేరుకుపోతోంది. ఫలితంగా దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. ఎక్కడికక్కడే వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. కుంటలు, చెరువులు నిర్వహణలేక దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. పంచాయతీ నిధుల నుంచి డీడీటీ పౌడర్ కొనడానికి నిధులు విడుదల కాలేదని కొందరు అధికారులు చెబుతున్నారు. చెరువులో ఆయిల్ బాల్స్ వేయడానికి కూడా నిధుల్లేక అధికారులు సమీక్షలు, సమావేశాలకే పరిమితమవుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

వసతి గృహాల విద్యార్థులను పట్టించుకునేదెవరు ?

జిల్లాలోని వసతి గృహాల్లో వేలమంది విద్యార్థులు చదువుకుంటున్నారు. డెంగీ కేసులు పాజిటివ్ వచ్చిన ప్రాంతాల్లోని సంక్షేమ హాస్టళ్లలో అబేట్ సొల్యూషన్ స్ప్రే చేయాల్సిన అవసరం ఉంది. అయితే ఇప్పటి వరకు ఎవరూ వచ్చిన దాఖలాలు లేవని విద్యార్థులు చెబుతున్నారు. హాస్టళ్లలో దోమల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. అయినా అధికారులకు చీమ కుట్టినట్టయినా లేదని విమర్శిస్తున్నారు. దీంతో అనేక మంది వసతి గృహాలకు చెందిన విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

ఎలిసా టెస్టులతో మాత్రమే డెంగీ నిర్ధారణ



జ్వరాలన్నీ కూడా డెంగీ జ్వరాలు కావు. ర్యాపిడ్ టెస్టుల్లో పాజిటివ్ వచ్చినా వాటిని డెంగీ పాజిటివ్‌గా పరిగణించలేం. ఎలిసా టెస్టులు మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు. మార్కాపురం, ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలల్లో ఎలిసా టెస్టులను ఉచితంగా చేస్తారు. ట్రీట్‌మెంట్ సెంటర్లు కూడా ఇవే. కనుక ప్రజలు రెండు రోజులకంటే ఎక్కువగా జ్వరం వచ్చినా, 104 జ్వరం వస్తున్నా వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి.

– డా.సురేష్ కుమార్, డీఎంహెచ్ఓ

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- కలెక్టరు ఏ.తమీమ్ అన్సారియా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

ఒంగోలు సిటీ: సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం సాయంత్రం కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఆర్డీఓ విశ్వేశ్వరరావు తో కలిసి డయేరియా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య భద్రతపై సంబంధిత శాఖల అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ గ్రామ, పట్టణ స్థాయిలో వైద్యఆరోగ్య ప్రజారోగ్య పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది బాధ్యతగా పనిచేస్తేనే ప్రజారోగ్య భద్రత సాధ్యమవుతుందన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల సీజనల్ డ్రగ్స్ ను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ పరిధిలోని అన్ని రకాల మంచినీటి పథకాలలో క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇక నుంచి ప్రతి శుక్రవారం డ్రైడే గా కాకుండా ప్రతి రోజు డ్రై డే గా పాటించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు వేడినీటిని తాగడం, స్వీయ పరిశుభ్రతను పాటించడంపై అవగాహన, విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ఎక్కడైనా డయేరియా కేసులు గుర్తించినట్లయితే ఆయా గ్రామాల్లో తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మంచినీటి సదుపాయాలు, వాటర్ ట్యాంకుల పారిశుద్ధ్యం పై సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖాధికారులు, ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తరచూ నీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ మాధురి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌అలీ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, బీసీ వెల్ఫేర్ అధికారి అంజన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా



కంభంలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- కంభంలో నాయకులతో సమావేశం

కంభం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం ఉదయం కందులాపురం కూడలిలో మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలు, కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులను నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపోయినా ప్రజాబలం పుష్కలంగా ఉందన్నారు. జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలందించారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపిస్తున్నాయని, దాడులు పెరిగిపోతున్నాయన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, ఎంపీపీ భర్త చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, అర్ధవీడు మాజీ ఎంపీపీ రవికుమార్, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, సర్పంచులు పల్నాటి బోడయ్య, మహబూబ్‌పీరా, రసూల్, వరికుంట్ల సుబ్బారావు, పెద్దకోటేశ్వరరావు, బత్తుల సూర్యప్రకాష్, పోతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, ఎంపీటీసీలు రఫీ, ఆనంద్, నాయకులు హుస్సేన్‌బాష, సబ్బసాని సాంబశివారెడ్డి, గంగారపు క్రిష్ణ, చలువాది రమణ, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.364



వేలం నిర్వహిస్తున్న ఏఎస్ గిరిరాజ్‌కుమార్

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర శనివారం గరిష్టంగా కేజీ రూ.364 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. పొదిలిలో పొగాకు బేళ్లు అమ్మగా, టంగుటూరులో కేంద్రంలో చూర కొనుగోలు చేస్తున్నారని ఆర్ఎం తెలిపారు. పొదిలి కేంద్రంలో 105వ రోజు వేలం పాటలో 202 బేళ్లు రాగా, 160 బేళ్లు కొనుగోలయ్యాయి. 42 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.364, కనిష్ట ధర రూ.203, సరాసరి రూ.271.38 పలికింది. టంగుటూరులో చూర కొనుగోలు చేస్తున్నట్లు అందులో 511 బేళ్లు రాగా, 471 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 40 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.186, కనిష్టంగా రూ.60 సరాసరి రూ.96.34 వచ్చిందని తెలిపారు.

పొగాకు అధికారిక కొనుగోళ్లు పూర్తి

పొదిలి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బోర్డు అనుమతించిన మేర పొగాకు కొనుగోళ్లు శనివారంతో పూర్తయింది. అధికారిక కోటా విక్రయం ముగిసే సరికి మొత్తం 9.01 మిలియన్ కిలోల పొగాకును ఆయా కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేశారు. సగటు ధర రూ.271.61 గా వచ్చింది.

దక్షిణాది అన్ని వేలం కేంద్రాల కంటే ఈ సగటు ధర ఎక్కువగా ఉందని వేలం అధికారి గిరిరాజ్ కుమార్ చెప్పారు. అత్యధిక ధర రూ.364 కాగా, అత్యల్ప ధర రూ.203గా వచ్చింది. 104 వేలం రోజుల్లో విక్రయించిన 9.01 మిలియన్ కిలోల పొగాకుకు రూ.244 కోట్లు రైతుల ఖాతాల్లోకి వచ్చాయి. మొత్తం అమ్మకాల్లో బ్రైట్ 21 శాతం కాగా రూ.302.67 ధర పలికింది. మీడియం రకం 33 శాతం కాగా రూ.307.24కు చేరింది. లో గ్రేడ్ రకం 46 శాతం కాగా, రూ.232.37 ధర వచ్చింది. ఆయా కంపెనీల ప్రతినిధులు 39 మంది వేలంలో పాల్గొన్నారు. 4319 మంది రైతులు 104 రోజులు జరిగిన వేలంలో పాల్గొన్నారు. పొగాకు రైతులు ఈ ధరలు చూసి, అధిక మొత్తంలో కౌలుకు పొలాలు, బ్యారన్‌లు తీసుకుని సాగు చేయవద్దని వేలం అధికారి గిరిరాజ్ కుమార్ తెలిపారు. కంపెనీ ప్రతినిధులు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జోరుగా ఈదురు గాలి



పచ్చబడిన సాగర్ ఆయకట్టులోని పెసర

- ఓ మోస్తరు వర్షం
- జిల్లాలో 36 మండలాల్లో వర్షపాతం నమోదు

ఒంగోలు సెంట్రల్: వాయుగుండం ప్రభావంతో జిల్లాలో ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. జిల్లాలో 39 మండలాలకు గాను 36 మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో మెట్ట పంటలు జీవం పోసుకున్నాయి. శనివారం మధ్యాహ్నానికి జిల్లాలో 293 మి.మీలు సరాసరి 7.5 మి.మీలు నమోదైంది. అందులో అత్యధికంగా కొమరోలులో 41.2 మి.మీలు నమోదు కాగా అత్యల్పంగా దోర్నాలలో 2.2 మి.మీలు నమోదైంది. ఆయా మండలాల్లో నమోదైన వర్షపాతం ఈ విధంగా ఉంది. మార్కాపురం 27.4 మి.మీలు, గిద్దలూరు 16.4 మి.మీలు, తర్లుపాడు 15.4, రాచర్ల 13.4, కొండపి 11.8, చీమకుర్తి 11, పెద్దారవీడు 10.6, ఎస్ కొండ 9.8, వెలిగండ్ల 9.6, బేస్తవారిపేట 8.6, జరుగుమల్లి, కంభంలలో 7.2 మి.మీల చొప్పున, ఒంగోలు రూరల్, అర్బన్‌లలో 6.8, ఎస్ఎన్‌పాడు, సీఎస్ పురంలలో 6.4 చొప్పున, టంగుటూరు, పామూరులలో 5.8 చొప్పున, పీసీపల్లిలో 5.4, తాళ్లూరు, కొనకనమిట్లలో 5.2 చొప్పున, ముండ్లమూరు, పొదిలిలలో 4.2, మర్రిపూడి, యర్రగొండపాలెం, త్రిపురాంతకంలలో 4 చొప్పున, కురిచేడులో 3.4, ఎన్‌జీపాడు, పొన్నలూరులలో 3.2 చొప్పున, కనిగిరి, దొనకొండలలో 3 చొప్పున, కొత్తపట్నం, మద్దిపాడు, దర్శి, పుల్లల చెరువులలో 2.8 మి.మీల చొప్పున నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పురోగతిలో ఉన్న పనులు పూర్తి చేసేలా చర్యలు

- కలెక్టరు ఏ.తమీమ్ అన్సారియా



ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: జిల్లాలో ఆర్అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టి పురోగతిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆర్అండ్‌బీ శాఖ ద్వారా చేపడుతున్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్డు మరమ్మతు పనుల ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలని ఆర్అండ్‌బీ శాఖ ఎస్ఈని ఆదేశించారు. రహదారుల భవనాల శాఖ ద్వారా చేపడుతున్న, ప్రతిపాదిత పనుల వివరాలను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ శాఖ ఎస్ఈ దేవానందం, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గొంతు వాపు వ్యాధి రాకుండా టీకాలు

● జిల్లా పశు సంవర్థక శాఖ జేడీ బేబీరాణి



పాడి రైతుకు జొన్న విత్తనాలు అందజేస్తున్న జేడీ బేబీరాణి

మద్దిపాడు: తొలకరి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాడి పశువులకు గొంతు వాపు వ్యాధి రాకుండా టీకాలు వేయించుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి అన్నారు. మండలంలోని ఏడుగుండ్లపాడు రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు ప్రభుత్వం ఇస్తున్న అన్ని రకాల టీకాలను పశువులకు వేయించాలని సూచించారు. జొన్న విత్తనాలు 75 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తుందని, ఈ అవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

బాధితులకు చేయూతనివ్వాలి



ఒంగోలు బాలసదన్‌ను పరిశీలిస్తున్న జిల్లా అదనపు న్యాయమూర్తి అమ్మన్నరాజా

ఒంగోలు సిటీ: బాధితులకు చేయూతనివ్వడం ద్వారా మెరుగైన సమాజం సృష్టించవచ్చని ఎనిమిదో జిల్లా అదనపు న్యాయమూర్తి, ఇన్‌చార్జి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి డి.అమ్మన్నరాజా అన్నారు. నగరంలోని బాలసదన్‌ను శనివారం సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. లైంగిక వేధింపులకు గురైన బాలబాలికలకు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బాలసదన్‌లోని వారికి మెరుగైన సదుపాయాలు అందించాలని అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో బాలసదన్ పర్యవేక్షకురాలు జీవిత, సిబ్బంది పాల్గొన్నారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడులు

● దాడుల్లో పాల్గొన్న డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు

ఒంగోలు టౌన్: నగరంలో చట్ట వ్యతిరేకంగా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న స్పా సెంటర్లపై పోలీసులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. నగరంలోని స్పా సెంటర్లలో అసాంఘిక కార్యాకలాపాలు జరుగుతున్నట్లు కొద్ది రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో పక్కా సమాచారంతో పోలీసులకు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలు ఇవ్వడంతో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు యంత్రాంగం మొత్తం స్పా సెంటర్లపై దాడులు చేశారు. డీఎస్పీ కిషోర్‌బాబు, సీఐలు



స్పా సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

జగదీష్, షేక్ అల్లీ సాహెబ్, అజయ్‌కుమార్, షేక్ ఖాజావలి, సుబ్బారావులతో పాటుగా ఎస్సైలు ఏఆర్ సిబ్బంది, పోలీసు సిబ్బంది మొత్తం దాడుల్లో పాల్గొన్నారు. నగరంలోని 17 స్పా సెంటర్లపై దాడులు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ పరిధిలో ఒక జంటను, తాలుకా పరిధిలో రెండు జంటలను అదుపులోనికి తీసుకున్నట్లు సమాచారం. గుంటూరు రోడ్డులోని ఒక స్పా సెంటర్ , ముంగమూరు రోడ్డులోని ఒక స్పా సెంటర్‌లో కొందరు జంటలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడ్డారు. దాడులు జిల్లాలో సంచలనం సృష్టించాయి. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలను ఆదివారం ఎస్పీ వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.

ఐజీని కలిసిన ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఎస్పీ ఏఆర్ దామోదర్ గుంటూరులో రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం లా అండ్ ఆర్డర్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితిని వివరించినట్లు సమాచారం.



ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని కలిసిన ఎస్పీ

ఎంపీ మిథున్ రెడ్డిపై దాడి సరికాదు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్ రెడ్డిపై పుంగనూరులో టీడీపీ నేతలు దాడి చేయడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఖండించారు. పుంగనూరు లాంటి ఘటనలు రాష్ట్రంలో మళ్లీ చోటు చేసుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కక్ష సాధింపు రాజకీయాలను పక్కనపెట్టి రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలపై దృష్టి సారించాలని హితవు పలికారు. శనివారం సీపీఐ సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, తక్షణమే ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం పదే పదే ఢిల్లీకి వెళ్లడం వలన ప్రయోజనం ఏమీ ఉండదని తేల్చి చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలను సాధించాలని సూచించారు. ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిలబడడానికి తెలుగుదేశం, జనసేన పార్టీల మద్దతు కీలకంగా మారిన నేపథ్యంలో దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం బాధ్యతగా ప్రయత్నించాలని కోరారు. వరదలకు దెబ్బతిన్న రైతులకు రైతు భరోసా కింద రూ.20 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రామకృష్ణ ఒంగోలు డెయిరీని పరిశీలించారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఆర్ వెంకటరావు, పీవీఆర్ చౌదరి తదితరులు ఉన్నారు.

మతోన్మాద చిచ్చుపెడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం

రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా దేశ ప్రజల మధ్య కుల, మతాల చిచ్చుపెడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం హిందూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మండిపడ్డారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ మతతత్వ, అవినీతి పాలనకు విసిగి వేసారిన ప్రజలు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 62 సీట్లు తగ్గించి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గుణపాఠం చెప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్, బీహార్, మహారాష్ట్రలకు చెందిన తెలుగుదేశం, జనసేన లాంటి ప్రాంతీయ పార్టీల వల్లే తిరిగి కేంద్రంలో అధికారం చేపట్టారన్నారు. చంద్రబాబు అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి భయపడే ఎన్డీఏలో చేరారని తెలిపారు. ప్రాంతీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నాయని, బడుగు, బలహీన వర్గాల ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మంచిది కాదని, ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు చర్యలకు తావులేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్‌సభ, రాజ్యసభల్లో బీజేపీకి తగినంత బలం లేదన్నారు. గత ఎన్నికల్లో ఇండియా కూటమి సమన్వయంతో వ్యవహరించి ఉంటే ఫలితాలు మరోలా ఉండేవని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 ఏళ్ల పాటు చేసిన పోరాటాలు, త్యాగాలను గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను, విద్వేష రాజకాయాలను ఎండగట్టేందుకు వామపక్ష పార్టీలతో పాటుగా లౌకిక పార్టీలు సమాయత్తం అవుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య తెలిపారు. పార్టీ శ్రేణులు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు, ఆర్ వెంకటరావు, అందే నాసరయ్య, కృష్ణయ్య, పీవీఆర్ చౌదరి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి విజయ తదితరులు పాల్గొన్నారు.

పిలిచి..వద్దన్నారు..

● కౌన్సిల్ అత్యవసర సమావేశానికి మీడియాకు నో ఎంట్రీ

కనిగిరి రూరల్: కనిగిరి పురపాలక సంఘ అత్యవసర కౌన్సిల్ సమావేశానికి పత్రికా, మీడియా ప్రతినిధులు హాజరు కావాలని తొలుత మున్సిపల్ అధికారులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు ఆహ్వానించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. వివిధ పత్రికల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. అయితే ఏమైందో.. ఏమో కాని అజెండా ప్రారంభించే సమయానికి కమిషనర్ టీవీ రంగరావు ప్రజా ప్రతినిధుల ఆదేశానుసారం అంటూ.. పత్రికా ప్రతినిధులను బయటకు వెళ్లాలని చెప్పారు. జీరో అవర్లు మీడియాను పిలుస్తామని.. అప్పుడు వచ్చి తమ సమాచారాన్ని తీసుకోవాలని కమిషనర్ వెల్లడించారు. దీంతో అన్ని పత్రికల ప్రతినిధులు బయటకు వెళ్లారు. కానీ జీరో అవర్‌లో కూడా వారిని ఆహ్వానించకుండా.. సమావేశం ముగిసిన తర్వాత విలేకర్ల సమావేశం అంటూ ఆహ్వానించగా.. ముగ్గురు నల్గురు మినహా మిగిలిన వారు గైర్హాజరైయ్యారు. అసలు తమను పిలవడమెందుకూ.. మరలా వద్దని చెప్పడం ఎందుకూ.. అంటూ కమిషనర్ వింత పోకడపై మీడియా ప్రతినిధులు కస్సు బుస్సులాడుతున్నారు.

కొత్త సంస్కృతికి శ్రీకారం చుట్టిన అధికారులు, పాలకులు

కమిషనర్ టీవీ రంగారావు చేస్తున్న వింత పోకడలకు ఇటు ప్రజానికంతో పాటు.. అటు మీడియా ప్రతినిధులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మీడియా ప్రతినిధులు లేకుండా మున్సిపల్ సమావేశం జరగడం బహుశా చరిత్రలో ఇదే మొదటి సారిగా చెప్పవచ్చు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. మీడియా ప్రతినిధులను మున్సిపల్, మండల, జెడ్పీ సమావేశాలకు ఆహ్వానిస్తారు.. ఇది రహస్య సమావేశాలు కావు...పార్టీ అంతర్గత సమావేశాలు అంతకన్నా కావు.. అయినా ఎందుకు ఇలా వ్యవహరించారనేది అర్థం కావడం లేదు.

ఆకతాయికి అరదండాలు

● ఎస్పీ ఆదేశాలతో మహిళకు సత్వర న్యాయం

ఒంగోలు టౌన్: 10 ఏళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఆకతాయి కటకటాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేయడానికి వెళ్లిన ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు అక్కడ ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఒక మహిళ కనిపించారు. ఆమెను పిలిపించి మాట్లాడిన ఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక ఆకతాయి 10 ఏళ్ల తన కూతురితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, మరొక వ్యక్తి తన భర్తపై కత్తితో దాడి చేసి పారిపోయాడని ఎస్పీకి విన్నవించారు. ఆమె నుంచి ఫిర్యాదును స్వీకరించిన ఎస్పీ సీసీఎస్ పోలీసులను వెంటనే రంగంలోకి దించారు. వెంటనే గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు నగరంలోని వంటవారి కాలనీకి చెందిన మిట్ట అనిల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు గతంలో వన్‌టౌన్ పరిధిలో చైన్ స్నాచింగ్ లకు పాల్పడ్డాడని, అతనిపై రౌడీషీట్ కూడా ఉందని సమాచారం. టూటౌన్ పోలీసుస్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలు, లైంగిక దాడులకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు, పిల్లలపై నేరాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

కంభంలో చోరీలు

కంభం: కంభంలోని సంగావీధిలో శనివారం రాత్రి రెండు ప్రాంతాల్లో చోరీలు జరిగాయి. వివరాల్లోకి వెళితే.. సంగా వీధిలో నివాసం ఉంటున్న పండ్ల వ్యాపారి శుక్రవారం భార్యతో కలిసి ఊరికి వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం పక్కింట్లో నివాసం ఉంటున్న వారు నీళ్ల మోటారు ఆన్ చేయడం కోసం రహంతుల్లా ఇంటి వద్దకు రాగా తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి వెంటనే రహంతుల్లాకు సమాచారం అందించాడు. కుటుంబసభ్యులు ఇంటి లోపలికి వెళ్లి చూడగా హాలులో, మరోగదిలో ఉన్న రెండు బీరువాలు పగలగొట్టి అందులోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి . బీరువాలో ఉన్న 2 జతల కమ్మలు, ఒక జత చెంపసవరాలు, జుంకాలు, రూ.5 వేల నగదు మొత్తం రూ.2 లక్షల విలువైన వస్తువులు అపహరణకు బాధితుడు తెలిపాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి



దొంగలు బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసిన దృశ్యం

చేరుకొని ఇంటిని పరిశీలించారు. మార్కాపురం క్లూస్ టీమ్ బృందం వేలిముద్రలను సేకరిస్తున్నారు.

అదే వీధిలో బైక్ అపహరణ

దొంగతనం జరిగిన కొద్ది దూరంలోనే ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న బైక్ అపహరణకు గురైంది. రోజుమాదిరిగానే ఇంటి ముందు బైక్ పార్క్ చేశానని, తెల్లవారుజామున లేచి చూసే సరికి ఇంటి ముందు బైక్ కనిపించడం లేదని బాధితుడు అశోక్ తెలిపారు.

విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో ఉదాసీనత వద్దు

నాగులుప్పలపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాల కల్పనలో ఏ ఒక్కరూ ఉదాసీనంగా వ్యవహరించొద్దని డీఈఓ సుభద్ర అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం అకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటశాలలను పరిశీలించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలల్లో ఉపాధ్యాయుల రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంఈఓలు రవి, రమణయ్య సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు సేవలందించడంలో ముందుండాలి




రెడ్‌క్రాస్ సొసైటీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ప్రజలకు సేవలు అందించడంలో ముందుండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన బ్రోచర్‌ను కలెక్టర్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులతో సమావేశమై సొసైటీ చేపడుతున్న సేవలు, కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించడంలో జిల్లా శాఖ తమ వంతు కృషి చేయాలని కోరారు. సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ సి.వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి, సెట్నల్ సీఈఓ లోకేశ్వరరావు, ట్రెజరర్ రాఘవయ్య, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



యువకుల ప్రాణాలు బలితీసుకున్న వల్లూరు చెరువు



వెంకటేష్(ఫైల్)

టంగుటూరు: మండలంలోని వల్లూరు చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే..మండలంలోని వాసేపల్లిపాడు గ్రామానికి చెందిన నల్లపలపు నవీన్(23), బాణాల వెంకటేష్(22) ఈత కొట్టేందుకు వల్లూరు చెరువులో దిగారు. చెరువులో లోతు ఎక్కువగా ఉండటంతో ఒకరు మృతి చెందగా వెంకటేష్ గల్లంతయ్యాడు. శుక్రవారం ఎంత వెతికినా వెంకటేష్ మృతదేహం లభ్యం కాలేదు. చీకటి పడటంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు నిలిపివేసింది. శనివారం వెంకటేష్ మృతదేహం నీళ్లలో తేలియాడడంతో సీఐ రంగనాథ్, ఎస్సై పున్నారావులు మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ వైద్యశాలకు తరలించారు.

రెండు కుటుంబాల్లో విషాదం

నవీన్, వెంకటేష్‌ల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవీన్ తండ్రి ఎడుకొండలు మృతి చెందడంతో తల్లి రమాదేవి కూతురు, కొడుకుని పెంచింది. కుమార్తెకు పెళ్లి చేసింది, నవీన్ గ్రానైట్ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. బాణాల వెంకటేష్ సొంతూరు వేటపాలెం. చిన్న వయసులోనే తల్లిదండ్రులు మృతి చెంధడంతో వాసేపల్లిపాడులోని నానమ్మ సామమ్మ వద్ద ఉంటున్నాడు. ఇద్దరి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పున్నారావు తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

● డ్వామా పీడీ అర్జున్‌రావు

● రూ.44.50 లక్షల రికవరీకి ఆదేశం

తాళ్లూరు(ముండ్లమూరు): ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడితే రికవరీతో పాటు క్రమశిక్షణ చర్యలు తప్పవని డ్వామా పీడీ బి.అర్జున్‌రావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 16 పంచాయతీల్లో వారం రోజులుగా ఆడిట్ డీఆర్పీలు క్షేత్ర స్థాయిలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఇంటింటికి తిరిగి మస్టర్లను పరిశీలించారు. చేపట్టిన పనులకు సంబంధించి సిబ్బంది సమక్షంలో కొలతలు చేపట్టారు. ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో కూలీల మస్టర్లు, కొలతల్లో తేడాలు ఉన్నట్లు నిర్ధారించారు. మండలంలో 791 పనులను రూ.5.83 కోట్లతో చేపట్టారు. ప్రతి గ్రామంలో చేపట్టిన పనుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. పనుల్లో రూ.44.50 లక్షల మేర సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు ఆడిట్ సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకురాగా రికవరీకి ఆదేశించారు. అందులో ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో తాళ్లూరులో రూ.87,270, నాగంబొట్లపాలెంలో రూ.77,373, వెలుగువారిపాలెంలో రూ.39,831, లక్కవరంలో రూ.6,12,056, మాధవరంలో రూ.25,848, శివరామపురంలో రూ.13,639, మన్నేపల్లిలో రూ.45,029, కొర్రపాటివారిపాలెంలో రూ.37,599, మల్కాపురంలో రూ.47,568, తూర్పుగంగవరంలో రూ.5,42,511, బొద్దికూరపాడులో రూ.77,710, దోసకాయలపాడులో రూ.19,138, బెల్లంకొండవారిపాలెంలో



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ అర్జున్‌రావు

రూ.57,598, తురకపాలెంలో రూ.4,25,881, రామభద్రాపురంలో రూ.18,268, విఠలాపురంలో రూ.40,712 మేర అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. అదే విధంగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఈడబ్ల్యూఐడీసీ శాఖల్లో కొంత మేర అక్రమాలుజరిగినట్లు నిర్ధారించారు. అనంతరం పీడీ అర్జున్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా రికవరీ చెల్లించాల్సిందేనన్నారు. రికవరీకి కొంత సమయం ఇస్తామని, గడువులోగా చెల్లించాలన్నారు. లేకుంటే క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ పి.ఝాన్సీరాణి, ఏపీడీ జీకే నిర్మలాదేవి, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ టి.నందిని, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.యుగకీర్తి, ఏపీఓ మురళి, డిఆర్పీలు సురేష్‌బాబు, భరత్‌కుమార్, చైతన్యకుమార్, నరేంద్ర, కోటేశ్వరరావు, సూర్యప్రకాశరావు, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనాలు లేని ఆహార ఉత్పత్తులు

● ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి

తాళ్లూరు(ముండ్లమూరు): వ్యవసాయంలో మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా రసాయనాలు లేని ఆహార ఉత్పత్తులు సాధించేందుకు రైతులు సహకరించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి. సుభాషిణి అన్నారు. మండలంలోని నాగంబొట్లపాలెం రైతు సేవాకేంద్రంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేస్తున్న రైతులకు అవసరమైన డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని, రైతులు కనీసం అర ఎకరా నుంచి ఎకరా వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లోనే జిల్లాలో పది వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భూమి, నీరు, వాతావరణం, మంచి భవిష్యత్‌కు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మేలు చేస్తాయన్నారు. నేలలు సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు, ఘన, జీవామృతాలు, పురుగుల నియంత్రణకు అస్త్రాలు, తెగుళ్ల నియంత్రణకు వివిధ కషాయాలు తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక



రైతులకు టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములు పంపిణీ చేస్తున్న అధికారులు

చేసిన గ్రామాల్లో సీఆర్పీలు, ఐసీఆర్పీలు జిల్లా వ్యాప్తంగా 250 మంది రైతులకు సలహాలు, సూచనలు ఇస్తామని పేర్కొన్నారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలో 300 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసినట్లు చెప్పారు. కౌలు రైతులు సాగు ధ్రువీకరణ కార్డులు తీసుకోవాలన్నారు. రాయితీపై ఇస్తున్న కందులు, వడ్లు ను రైతులు తీసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయ సహకారాలు, మెళకువలు నేర్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ సుబ్బారావు, రైతులు యాతం శ్రీనివాసరెడ్డి, పాశం హరిబాబు, వి.నరసింహారెడ్డి, ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జిలు నరసింహులు, ప్రభాకర్, వీఏఏ శ్రీను, ఏఈఓ నాగరాజు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

మద్దిపాడు: లారీ ఛాసిస్ తిరగబడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఏడుగుండ్లపాడు రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే.. చెన్నైకు చెందిన నాగూర్ బేగ్(35) చెన్నై నుంచి విజయవాడకు లారీ ఛాసిస్ తీసుకువస్తుండగా ఏడుగుండ్లపాడు సమీపంలో డివైడర్‌ను ఢీకొని రెండో వైపు తిరగబడి డ్రైవర్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా..వారు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని ఒంగోలు రిమ్స్ తరలించగా కోమాలోకి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మద్దిపాడు ఎస్సై వి.మహేష్ కేసు నమోదు చేసి వారి కుటుంబసభ్యులకు తెలియజేశారు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిస్తామన్నారు.